క్లుప్తంగా

నేటి నుంచి తూర్పులో హాథ్ సే హాథ్ జోడో యాత్ర

వరంగల్: హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే కొండా సురేఖ గురువారం నుంచి పాదయాత్ర నిర్వహించనున్నారు. ఈయాత్ర ఉదయం 8నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సాగుతుందని పార్టీ వర్గాలు తెలిపాయి. 9న తూర్పులోని 12, 13 డివిజన్లలో ప్రారంభమై ఫిబ్రవరి 5వరకు యాత్ర సాగుతుంది. 18, 19వ తేదీల్లో మహాశివరాత్రి పండుగ సందర్భంగా పాదయాత్రకు విరామం ఇచ్చారు.

ప్రభుత్వ పాఠశాలకు విరాళం



విద్యారణ్యపురి: హనుమకొండలోని పెట్రోల్ పంపు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఫర్నిచర్‌తోపాటు ప్రొజెక్టర్‌ను రిటైర్డ్ ఉపాధ్యాయురాలు అనంతలక్ష్మి సోమనాథ్ బుధవారం విరాళంగా అందజేశారు. మైక్‌సెట్, గ్రీన్‌బోర్డులు తదితర వస్తువులను అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హనుమకొండ డీఈఓ ఎండీ.అబ్దుల్‌హై మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలకు దాతలు చేయూతనందించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈఓ రాంకి షన్‌రాజు, కార్పొరేటర్ బైరి లక్ష్మీకుమారి, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జిలుకర ఏకాంతం, ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలామృతంలో అనేక పోషకాలు



కరీమాబాద్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందించే బాలామృతంలో అనేక పోషక పదార్థాలుంటాయని ఐసీడీఎస్ ఉర్సు సెక్టార్ సూపర్‌వైజర్ బత్తిని రమాదేవి తెలిపారు. 32వ డివిజన్ విమ్స్ కళాశాల, ఎస్ఆర్ఆర్ తోట, బీరన్నకుంట అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) ద్వారా పిల్లలకు పోషకాహారం అందజేస్తున్నట్లు వివరించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని రమాదేవి కోరారు.

'ఎన్నికల హామీలు అమలు చేయని ఎమ్మెల్యే'

కాజీపేట రూరల్: ఎన్నికల హామీలను వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేష్ అమలు చేయడం లేదని మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్ విమర్శించారు. ఈమేరకు మడికొండలోని తన నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రాజు మాట్లాడుతూ మడికొండ ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ పాఠశాల తరహాలో అభివృద్ధి చేస్తానని, గ్రామంలో నూతన గ్రంథాలయం ఏర్పాటు చేస్తానని, డంపింగ్ యార్డును మడికొండ నుంచి ఇతర ప్రాంతానికి తరలిస్తానని, మెట్టుగుట్ట దేవాలయాన్ని టూరిజం హబ్‌గా మారుస్తానని, ఎస్సీ కాలనీలోని శ్మశాన వాటికను అభివృద్ధి చేస్తానని, బస్తీ దవాఖాన ఏర్పాటు చేస్తానని, మడికొండ గ్రామంలో డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మిస్తానని ఎమ్మెల్యే పలు వాగ్దానాలు చేశారని గుర్తుచేశారు. ఇప్పటి వాటిలో ఏ ఒక్కటి పూర్తిస్థాయిలో అమలు చేయలేదని అన్నారు.

కరాటే క్రీడాకారులకు కలెక్టర్ అభినందన



హన్మకొండ: జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన క్రీడాకారులను కలెక్టర్ సిక్తా పట్నాయక్ అభినందించారు. ఈనెల 5న నర్సంపేటలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో హనుమకొండ వికాస్‌నగర్‌లోని కౌటిల్య స్కూల్ విద్యార్థులు పాల్గొని బంగారు పతకాలు అందుకున్నారు. ఈమేరకు హనుమకొండలోని కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను క్రీడాకారులు బుధవారం కలవగా, వారిని ఆమె అభినందించారు.

ఫజల్‌కు డాక్టరేట్



న్యూశాయంపేట: చింతల్ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఫజల్ - ఉర్ - రహమాన్ మెకానికల్ ఇంజనీరింగ్‌లో డాక్టరేట్ పట్టాను అందుకున్నాడు. రాజస్థాన్ రాష్ట్రంలోని సింఘానియా విశ్వవిద్యాలయంలో 500 ఎండబ్లు ఆవిరి టర్బైన్ పనితీరు, ఆప్టిమైజేషన్‌పై డాక్టర్ టిఎస్.చౌహాన్, డాక్టర్ సయ్యద్ నవాజిష్ మెహదీ సంయుక్త పర్యవేక్షలో సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి ఆయనకు అక్కడి యూనివర్సిటీ అధికారులు డాక్టరేట్ ప్రదానం చేశారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

కాశిబుగ్గ: వరంగల్ 18వ డివిజన్ లేబర్‌కాలనీలోని క్రిస్టియన్‌కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు.. ఉపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టి తోటి వారికి పాఠ్యాంశాలు బోధించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పాఠశాల హెచ్‌ఎం వెంకటనర్సయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయ వృతి ఎంతో పవిత్రమైనదని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కర్, దేవరాజు, వీణ, నారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాశిబుగ్గ: క్రిస్టియన్‌కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు



బొల్లికుంటలో స్వయం పాలన దినోత్సవంలో..

బొల్లికుంటలో స్వయం పాలన దినోత్సవం

ఖిలా వరంగల్: వరంగల్ 17వ డివిజన్ బొల్లికుంట గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు పిండి ఆనందబాబు ఆధ్వర్యంలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు.. ఉపాధ్యాయులుగా మారి తోటి స్నేహితులకు పాఠ్యాంశాలు బోధించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఆనందబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయుడు నిరంతర విద్యార్థి అని అన్నారు. ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనదని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ గట్టికొప్పుల కేదారి, వైస్ చైర్మన్ మనుపాటి భాగ్యలక్ష్మి, కీర్తి కుమారస్వామి, అలివేలు, మంగ పూల, రవి, చందన, రఘు, శివాజీ, శ్రీనివాస్‌రావు, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

సమాజ సేవ చేయడమే అభిమతం కావాలి

హన్మకొండ కల్చరల్: సేవ చేయడమే ప్రతీఒక్కరి అభిమతం కావాలని పూర్వ మల్టీపుల్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ వంగాల గోపాల్‌రెడ్డి సూచించారు. చింతగట్టులోని ఎస్పీఆర్ గార్డెన్స్‌లో దొమ్మాటి వెంకటస్వామి అధ్యక్షతన సదాశ్రీ లయన్స్ ప్రాంతీయ సదస్సు మంగళవారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా రీజియన్ ఆఫ్ ది లయన్‌గా నరహరి సుధాకర్‌రెడ్డికి అవార్డు ప్రదానం చేశారు. పూర్వ జిల్లా గవర్నర్ పింగిలి సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో రూ.3 లక్షల విలువగల ఎనిమిది కుట్టుమిషన్లు, చీరలు, విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, డిక్షనరీలు, దుప్పట్లను పంపిణీ చేశారు. ఉప జిల్లా గవర్నర్ కుందూరు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ వ్యర్థాల సేకరణలో ప్రతిసభ్యుడు భాగస్వామి కావాలని కోరారు. నాట్యమయూరి నృత్యకళాక్షేత్రం నిర్వాహకులు కుండె అరుణ శిష్యబృందం శాస్త్రీయ నృత్యాలు అలరించాయి. జోనల్ చైర్మన్లు నరేందర్, డాక్టర్ రాజిరెడ్డి.. నివేదికలు సమర్పించారు. మాస్టర్ ఆఫ్ సెర్మోనిగా వేణుమాధవ్ వ్యవహరించగా, కార్యక్రమంలో పూర్వ జిల్లా గవర్నర్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, డాక్టర్ కె.లక్ష్మీప్రసాద్, పింగిలి సంపత్‌రెడ్డి, డాక్టర్ అజిత్‌కుమార్, డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య, హరికిషన్‌రెడ్డి పాల్గొన్నారు.



అవార్డు ప్రదానం చేస్తున్న గోపాల్‌రెడ్డి

అపరిచిత వ్యక్తులతో చాటింగ్ చేయొద్దు

హసన్‌పర్తి: అపరిచిత వ్యక్తులతో చాటింగ్ చేయొద్దని ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సమితి మండల కోఆర్డినేటర్ సుదర్శన్ సూచించారు. మానవ, బాలల అక్రమ రవాణాను అరికట్టడం అనే అంశంపై హసన్‌పర్తి మండలం దేవన్నపేట జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టడానికి, బాలకార్మిక వ్యవస్థను రూపుమాపడానికి ప్రతీఒక్కరు కృషి చేయాలని అన్నారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని పేర్కొన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని చెప్పారు. అనంతరం చైల్డ్‌క్లబ్ కమిటీని ఎన్నుకున్నారు. ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నెరవేరని తెలంగాణ ప్రజల ఆకాంక్ష



బహిరంగ సభలో మాట్లాడుతున్న ప్రవీణ్‌రెడ్డి

కేయూ క్యాంపస్: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ ఆకాంక్షలు నెరవేరడం లేదని, ఈక్రమంలో విద్యార్థి, నిరుద్యోగ, ప్రజావ్యతిరేక పాలనను అంతమొందించడానికి పోరాడాలని ఏబీవీపీ పూర్వ రాష్ట్ర కార్యదర్శి, వర్కింగ్ కమిటీ మెంబర్ ప్రవీణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నిర్వహిస్తున్న జిల్లా మహా సమ్మేళనాల్లో భాగంగా హనుమకొండ పట్టణంలో నగరంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం కాకతీయ యూనివర్సిటీలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. విద్యారంగ సమస్యలు, సామాజిక అసమానతలపై ఏబీవీపీ నిరంతరం పోరాడుతోందని అన్నారు. నాలుగు కోట్లమంది చిరకాల వాంఛ తెలంగాణ రాష్ట్ర సాధన నెరవేరినా ఉద్యమం ఆకాంక్షలు మాత్రం నెరవేరలేదని విమర్శించారు. సమావేశంలో రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మాచర్ల రాంబాబు, రాష్ట్ర కార్యసమితి సభ్యుడు కుంట హర్షవర్ధన్, హనుమకొండ జిల్లా కన్వీనర్ నిఖిల్, వరంగల్ మహానగర కార్యదర్శి ఆరెపల్లి సుజాత్, విభాగ్ గర్ల్స్ ఇన్‌చార్జ్ బోడ బిందు, తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్‌కు వేతనం పెంపు



వేతనం పెంపు కాపీని అందజేస్తున్న ప్రిన్సిపాల్

న్యూశాయంపేట: వరంగల్ రంగశాయిపేట శివారు జక్కలొద్ది తెలంగాణ మైనార్టీ బాలుర -1(ఎస్‌ఈ) గురుకులంలో మహ్మద్ సర్వర్ మొహియొద్దీన్.. కౌన్సిలర్‌గా 15 ఏళ్లగా నామమాత్రపు వేతనంతో సేవలు అందిస్తున్నారు. మైనార్టీ గురుకులాల్లో అడ్మిషన్‌ల కోసం నిరంతరం సేవాదృక్పథంతో పనిచేస్తున్నారు. కాగా, ఇటీవల టెమ్రిస్ సెక్రటరీ షఫియుల్లా వరంగల్‌లో పర్యటించగా, కౌన్సిలర్ విషయాన్ని అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీలకు చెందిన ప్రతినిధులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దాంతో వేతనం పెంచుతూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు వేతనం కాపీని మొహియొద్దీన్‌కు గురుకులంలో ప్రిన్సిపాల్ భిక్షపతి అందజేసి బుధవారం అభినందించారు. కార్యక్రమంలో అయేష, రమేష్, షరీఫ్, విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఆయుష్మాన్ భారత్ ఓ వరంలాంటిది

కాశిబుగ్గ: ఆయుష్మాన్ భారత్ పథకం ఓ వరంలాంటిదని, దాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కోట సతీష్ పిలుపునిచ్చారు. పార్టీ ఆధ్వర్యంలో 20వ డివిజన్ కాశిబుగ్గలో ఆయుష్మాన్ భారత్ నమోదు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆయుష్మాన్ భారత్ పథకం పేద ప్రజలకు ఓ వరంలాంటిదని కొనియాడారు. దీనిద్వారా రూ.5లక్షల వరకు ఉచిత వైద్యం పొందవచ్చని ఆయన అన్నారు.

ఎల్‌బీనగర్‌లో ఆయుష్మాన్ కేంద్రం

వరంగల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ నమోదు కేంద్రాన్ని 21వ డివిజన్ ఎల్‌బీనగర్‌లో బీజేపీ నాయకుడు కుసుమ సతీష్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలు ఆయుష్మాన్ భారత్‌లో తమ పేర్లు నమోదు చేసుకొని రూ.5లక్షల ఆరోగ్య బీమా పొందాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, నాయకులు పరమేశ్వర్, రంజిత్, రఘునారెడ్డి, రజనీష్ నేత, శ్యాం, రాజు, వెంకటేష్ పాల్గొన్నారు.


విద్యారంగానికి నిధుల కేటాయింపుల్లో నిర్లక్ష్యం

విద్యారణ్యపురి: విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపుల్లో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) హనుమకొండ జిల్లా కమిటీ నాయకులు విమర్శించారు. ఈమేరకు హనుమకొండ అశోక్ జంక్షన్‌లో బుధవారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు మిశ్రీన్ సుల్తానా, కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని పూర్తిగా విస్మరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో సరిపడా నిధులు కేటాయించకుండా బడుగు బలహీన వర్గాలకు విద్యను అందకుండా చేస్తున్నాయని వాపోయారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెడుతామని పేర్కొన్నప్పటికీ నేటికీ అమలు చేయటం లేదన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హనుమకొండ ఉపాధ్యక్షుడు మూల వేణు, కేయూ అధ్యక్షుడు హాథిరామ్, బాధ్యులు సాగర్, హర్షిత, నవీన్, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఓటర్, ఆధార్ అనుసంధానం పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వాసుచంద్ర

హన్మకొండ అర్బన్: ఓటరు గుర్తింపుకార్డుకు ఆధార్ అనుసంధానం ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లను ఇన్‌చార్జ్ జిల్లా అదనపు కలెక్టర్, డీఆర్ఓ వాసుచంద్ర ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో హనుమకొండ జిల్లాలోని వరంగల్ పశ్చిమ నియోజకవర్గం -105కు సంబంధించిన ఓటర్ల ఓటరు గుర్తింపు కార్డుకు ఆధార్ అనుసంధానం నమోదు ప్రక్రియపై బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు గుర్తింపు కార్డుకు ఆధార్ అనుసంధానం, ఫొటో సిమిలారిటీ ఎంట్రీ, పూర్ క్వాలిటీ ఫొటోలను గుర్తించడం ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. డీడబ్ల్యూఓ సబిత, అడిషనల్ డీఎంహెచ్ఓ మదన్‌మోహన్‌రావు, హనుమకొండ తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎలక్షన్ సూపరిడెంటెంట్ శ్రీధర్, బీఎల్ఓలు, ఆశ వర్కర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య



హరిప్రసాద్ (ఫైల్)

కాశిబుగ్గ: గుర్తు తెలియని రైలుకింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన చింతలపల్లి - వరంగల్ రైల్వే స్టేషన్ల మధ్య బుధవారం చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని చింతల్‌కు చెందిన అంకం హరిప్రసాద్ (26) నగరంలోని ఓ హోటల్‌లో వర్కర్‌గా పని చేస్తున్నాడు. ఈక్రమంలో చెడు వ్యసనాలకు బానిసై ఆర్థిక పరమైన సమస్యలతో జీవితంపై విరక్తి చెంది చింతల్ సమీపంలో రైలు పట్టాలపైకి వెళ్లి గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించి తండ్రి బాలనర్సుకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. మృతుడికి అన్న, చెల్లె ఉన్నారు.

రైలులో నుంచి జారిపడి కాజీపేట వాసి మృతి

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే డ్రైవర్ల కార్యాలయం సమీపంలో కాజీపేట విష్ణుపురి ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారి కిందపడి బుధవారం మృతి చెందాడు. కాజీపేట జీఆర్పీ ఎస్సై అశోక్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం విష్ణుపురి ప్రాంతానికి చెందిన గడప నర్సింహమూర్తి (62) వరంగల్ నుంచి కాజీపేట వైపు వెళ్తున్న రైల్‌లో ప్రయాణిస్తూ కాజీపేట సమీపంలో రైల్‌లో నుంచి జారిపడి అక్కడికక్కడ మృతి చెందాడు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ఉంది.

సంక్షిప్తంగా

నేటి పొదుపు.. రేపటికి భద్రత

కేయూ క్యాంపస్: నేడు పొదుపు చేస్తే భవిష్యత్‌లో అది తమకు భద్రతను ఇస్తుందని కాకతీయ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వరలక్ష్మి సూచించారు. కేయూలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల, బెంగుళూరులోని నోవైస్ లెర్నింగ్ అకాడమీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు సంయుక్తంగా ఆన్‌లైన్ వేదికగా నిర్వహించిన ఇన్వెస్టర్ అవేర్‌నెస్ ప్రోగ్రాంలో ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొని మాట్లాడారు. కోవిడ్ నేపథ్యంలో ప్రజల్లో ఆర్థిక అవగాహన పెరిగిందని అన్నారు. అలాగే, డిజిటల్ కరెన్సీ ప్రభావం ఎక్కువైందని తెలిపారు. నోవైస్ లెర్నింగ్ అకాడమి ప్రైవేట్ లిమిటెడ్ కోఫౌండర్ కార్తీక్ సీఎస్ మాట్లాడుతూ ప్రజల్లో వ్యక్తిగత ఆర్థిక అవగాహన అవసరం అని పేర్కొన్నారు. సమన్వయకురాలిగా సోనియా సోమన్ వ్యవహరించగా, డాక్టర్ ఫణీంద్ర, డాక్టర్ ప్రగతి పాల్గొన్నారు.

విద్యార్థుల వ్యవసాయ క్షేత్ర పర్యటన

వరంగల్: వరంగల్ ఎల్‌బీనగర్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో నిర్వహిస్తున్న స్మార్ట్ లివింగ్‌లో భాగంగా 'సస్య భారత్' కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా వరంగల్‌లోని వ్యవసాయ క్షేత్రానికి విద్యార్థులు బుధవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ సైనికుడే కాదు రైతు కూడా దేశాభివృద్ధిలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాడని తెలిపారు.

ఎన్‌సీసీ వలంటీర్లకు సన్మానం


కేయూ క్యాంపస్: ఢిల్లీలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పాల్గొన్న సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎన్‌సీసీ ఆర్మీవింగ్ విభాగానికి చెందిన సీహెచ్.ఉదయ్, అదేవిధంగా తత్ సైనిక్‌క్యాంపులో పాల్గొన్న ఎండీ.అవీఎద్‌ను కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య, అధ్యాపకులు బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, నిబద్ధత, పట్టుదల పెరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ హనుమంతు, ఎన్‌సీసీ అధికారి డాక్టర్ స్వామి, చాడ ప్రసాద్, డాక్టర్ ఫిరోజ్, డాక్టర్ శ్రీధర్‌కుమార్, డాక్టర్ తిరుణహరి శేషు, డాక్టర్ పుల్లా రమేష్ పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల సంఘం అధ్యక్షుడిగా జనార్దన్



హన్మకొండ చౌరస్తా: ప్రైవేట్ పాఠశాలల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా కాపువాడలోని ప్రదీప్ హైస్కూల్ కరస్పాండెంట్ వర్ధమాన్ జనార్దన్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా పి.వెంకటరమణ, కోశాధికారిగా డి.శంకర్, ఉపాధ్యక్షుడిగా నేతాని శ్రీనివాసరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా శుభాంద్, ట్రెజరర్‌గా మల్లాడి ప్రభాకర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సంతోష్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా బుచ్చిబాబు, వేణుమాధవ్ ఎన్నికైనట్లు ఎన్నికల నిర్వాహకులు షణ్ముఖచారి తెలిపారు.

హెల్పింగ్ హ్యాండ్స్ రాష్ట్ర అధ్యక్షుడిగా రాజుగౌడ్



కాశిబుగ్గ: హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా కాశిబుగ్గకు చెందిన బొంగోని రాజుగౌడ్ నియమితులయ్యారు. ఈమేరకు సంస్థ ఫౌండర్, చైర్మన్ మరీదు శివరామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మంత్రిని కలిసిన మార్కెట్ పాలకవర్గం

వరంగల్ రూరల్: మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ పాలకవర్గ సభ్యులు హైదరాబాద్‌లో మంగళవారం రాత్రి మర్యాద పూర్వకంగా కలిశారు. పాలకవర్గం పదవీకాలం పొడిగించినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దిడ్డి భాగ్యలక్ష్మి, వైస్ చైర్మన్ కాలేరు కరంచంద్, సభ్యులు కంది రవీందర్ రెడ్డి, గోలి రాజయ్య, తుమ్మ రవీందర్ రెడ్డి ఉన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కాజీపేట రూరల్: కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు బీజేపీ జిల్లా నాయకుడు పొనగాటి వెంకట్‌రావు, 46వ డివిజన్ అధ్యక్షుడు ముత్తోజు సురేష్ పిలుపునిచ్చారు. కాజీపేట మండలం మడికొండలో డివిజన్ కార్యకర్తల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి మరింతగా కృషి చేయాలన్నారు.

క్రీడాకారులకు టీషర్టుల పంపిణీ

హసన్‌పర్తి: క్రికెట్ క్రీడాకారులకు టీషర్టులను పంపిణీ చేశారు. అన్నాసాగరం శివారులో నిర్వహిస్తున్న కేసీఆర్ ప్రీమియర్ లీగ్ పోటీల్లో భాగంగా మల్లారెడ్డిపల్లి, గంటూరుపల్లి గ్రామాల మధ్యపోటీ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా మల్లారెడ్డిపల్లి సర్పంచ్ కేతపాక శాంతభగత్.. తమ గ్రామానికి చెందిన క్రీడాకారులకు టీషర్టులను అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మేడిపల్లి మదన్‌గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ ఎల్లేష్, స్థానికులు శ్రావణ్, శ్రీధర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

హసన్‌పర్తి: నంది అవార్డు గ్రహీత కనకం రాజేందర్‌ను స్థానికులు సన్మానించారు. ఇటీవల తెలంగాణ ఉద్యమ కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమలో రాజేందర్‌కు నంది అవార్డు అందజేసి నిర్వాహకులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనను బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, స్థానికులు బోడ యుగంధర్, కుమార్, పుల్లా దుర్గారాం, కుమార్, పార్థసారథి, పెద్దమ్మ శ్రీనివాస్, రాజు బుధవారం అభినందించారు.

జాఫర్‌కు కీర్తిరత్న అవార్డు

కాజీపేట రూరల్: కాజీపేట రాంనగర్ ప్రాంతానికి చెందిన నేషనల్ ఐరన్ జిమ్ సెంటర్ నిర్వాహకుడు, సామాజిక కార్యకర్త, నేషనల్ ఛాంపియన్‌షిప్ వెయిట్ లిఫ్టింగ్ విన్నర్ ఎండి.జాఫర్‌కు కీర్తిరత్న నేషనల్ గోల్డ్‌మెడల్ అవార్డు లభించింది. ఇటీవల హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో ఫౌండర్ పాలంగి జోసెఫ్ నుంచి అవార్డు స్వీకరించినట్లు జాఫర్ తెలిపారు. ఈ మేరకు ఆయనను పలువురు అభినందించారు.

మా పొట్ట కొట్టొద్దు



ఆందోళన చేస్తున్న మార్కెట్ కార్మికులు

వరంగల్: మార్కెట్‌కు వచ్చే రైతులు దయతో ఇచ్చే మిర్చిని అధికారులు లాక్కెళ్లారని వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లోని మిర్చి యార్డులోని దిగుమతి, కటాఫ్ కార్మికులు ఆరోపించారు. ముందస్తు ఎలాంటి హెచ్చరికలు లేకుండా ఈవిధంగా అధికారులు చేయడం సరికాదంటూ మార్కెట్‌లోని మిర్చి యార్డు కార్యాలయం ఎదుట దిగుమతి, కటాఫ్ కార్మికులు బుధవారం ఆందోళన చేశారు. మిర్చి యార్డు వద్ద పెట్టిన బస్తాల వద్దకు వచ్చి రైతుల అనుమతి లేకుండానే మిర్చిని తీసుకుపోతున్నారని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలోనే మార్కెట్ అధికారులు ఈచర్యకు పూనుకున్నట్లు తెలిసింది. అనుమతి లేకుండా మిర్చి తీసుకుపోయే ఆనవాయితీకి చెక్ పెట్టాలని రైతులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య

కేయూ క్యాంపస్: తొమ్మిది దశాబ్దాలకు పైగా చరిత్ర కలిగిన హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 1979 - 1980వ బ్యాచ్ టిస్ట్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒక చోట కలుసుకుని చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బన్న అయిలయ్యతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులతో ఓ కమిటీ ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్‌ను కోరగా, అందుకు ఆయన సరేనన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ హనుమంతు, డాక్టర్ ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అదానీ, అంబానీలకు దోచిపెడుతున్న కేంద్రం'



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

ఖిలా వరంగల్: దేశ సంపదను బడా పెట్టుబడిదారులు అదానీ, అంబానీలకు కేంద్ర ప్రభుత్వం దోచిపెడుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తక్కళ్లపెల్లి శ్రీనివాస్‌రావు ఆరోపించారు. వరంగల్ శివనగర్‌లోని తమ్మెర భవనం సీపీఐ జిల్లా కార్యాలయంలో బుస్సా రవీందర్ అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో శ్రీనివాస్‌రావు మాట్లాడారు. పేదలను విస్మరించి కార్పొరేట్ శక్తులకే దేశ సంపదను నరేంద్రమోదీ ప్రభుత్వం కట్టబెడుతోందని విమర్శించారు. దేశంలోని విమానాశ్రయాలు, పోర్టులు, ఎల్ఐసీ, బ్యాంకులు, రైల్వేలాంటి ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తూ పెట్టుబడిదారులను అందలం ఎక్కిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ అభివృద్ధిపై కపట ప్రేమను చూపిస్తూ నిధులు కేటాయించకుండా తీవ్ర వివక్ష చూపుతోందని అన్నారు. విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్‌చేస్తూ బయ్యారం నుంచి హైదరాబాద్ వరకు ఎర్రదండు లాంగ్ మార్చ్‌ను మార్చి 17నుంచి ఏప్రిల్ 17వరకు నిర్వహించనున్నట్లు వివరించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, సహాయ కార్యదర్శి షేక్‌బాషుమియా, పంజాల రమేష్, పనాస ప్రసాద్, లక్ష్మణ్, రమేష్, బద్రి, శంకరయ్య పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామస్వామి

కరీమాబాద్: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి పిలుపునిచ్చారు. ఉర్సు సీఐటీయూ కార్యాలయంలో సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల ఆధ్వర్యంలో బుధవారం జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకువస్తోందని ఆరోపించారు. కార్మికులకు పని భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించకుండా నిర్లక్ష్యం వహిస్తోందని అన్నారు. కార్మిక హక్కుల కోసం పోరాటాలు చేయకుండా చట్టాలను నిర్వీర్యం చేస్తోందని అన్నారు. ఈ సమావేశంలో ఆయా సంఘాల నాయకులు భూక్య సమ్మయ్య, ఈసంపల్లి బాబు, ఇనుముల శ్రీనివాస్, యాదగిరి, మురళి, కుమారస్వామి, వెంకన్న, ప్రభాకర్, ఉపేందర్, శ్రీవాణి, దివ్య తదితరులు పాల్గొన్నారు.

వారందాటినా అందని వేతనాలు

● ప్రభుత్వ తీరుపై ఉద్యోగుల మండిపాటు

హన్మకొండ అర్బన్: ఫిబ్రవరి నెల మొదలై వారం దాటింది. సగటు ప్రభుత్వ ఉద్యోగులకు అందాల్సిన వేతనం ఇప్పటివరకు అందలేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలుమార్లు మొబైల్ ఫోన్‌లో బ్యాలెన్స్ చెక్ చేసుకుంటే జీరో బ్యాలెన్స్‌గానే దర్శనమివ్వడంతో ఉద్యోగులు ఉసూరుమంటున్నారు. నిధులు లేని కారణంగా గతంలో ఆల్ఫాబెటికల్ ఆర్డర్‌లో జిల్లాలకు వేతనాలు జమచేసేవారు. వరంగల్ జిల్లాకు ఆఖరున వచ్చేవి. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్ తదితర జిల్లాలో మొత్తం ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో ఏ రెండు జిల్లాల ఉద్యోగులు కలిసినా 'మీ జిల్లాలో జీతాలు పడ్డాయా' అంటూ ఆరా తీస్తుండటం పరిపాటిగా మారింది. మొత్తంగా సుమారు 40వేల మంది వరకు ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ తదితర ఉద్యోగులు వేతనాల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వెంటనే ఖాతాల్లో డబ్బులు జమచేయాలని కోరుతున్నారు.